సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 23 । మే । 2023

అక్షర యోధుడు కేతు



సాహితీ దిగ్గజం ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మరణం పట్ల సాహితీ లోకంలో సంతాపం వెల్లువెత్తుతోంది. సాహితీవేత్తలతోపాటు వామపక్షాల నాయకులు, ప్రజాసంఘాలు సంతాపం వ్యక్తం చేస్తున్నాయి. - IIలో



ప్రజల గుండెలలో 'పెద్దాయన'

కరువు లాంటి విపత్కర పరిస్థితులలోనూ ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు దివంగత వైఎస్ రాజారెడ్డి. అందరినీ ఏకతాటిపై నడిపించిన ఆయనకు పులివెందుల పెద్దాయనగా పేరు వచ్చింది. - IIలో



ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. - IIలో

న్యూస్‌రీల్

హౌసింగ్ లక్ష్యాలు పూర్తి చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో నిర్దేశిత హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో గృహ నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వెలిదండ్ల ప్రధానోపాధ్యాయుడు సస్పెన్షన్

కడప ఎడ్యుకేషన్ : లింగాల మండలం వెలిదండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొల్లు మురళీకృష్ణను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వై. రాఘవరెడ్డి తెలిపారు. నాడు–నేడు పనుల నిర్వహణలో నిర్లక్ష్యం, విధి నిర్వహణలో అలసత్వం, పరిపాలన సరిగా లేకపోవడం తదితర కారణాలతో క్రమశిక్షణ చర్యల కింద ఆయనను విధుల నుంచి తొలగించినట్లు డీఈఓ పేర్కొన్నారు.

25 నుంచి ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షలు

ఏఎఫ్‌యూ : కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 25 నుంచి జూన్ 5వ తేదీ వరకు 2వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ టెక్నాలజీస్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, యానిమేషన్, స్కల్ప్చర్ విభాగాలకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి



సమస్యలను తెలుసుకుంటున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని డీఆర్వో గంగాధర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్వో గంగాధర్‌గౌడ్, అనుడ సెక్రటరీ శ్రీలక్ష్మిలు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు.

ఆర్టీపీపీ సీఈ బాధ్యతల స్వీకరణ



ఆర్టీపీపీ సీఈ నాగరాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉద్యోగులు తదితరులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) చీఫ్ ఇంజినీర్(సీఈ)గా టి. నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కూడా ఈయన ఆర్టీపీపీ సీఈగా పనిచేశారు. ఈయనకు ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇంజినీర్లు ఘన స్వాగతం పలికారు.పలు యూనియన్ నాయకులు, కార్మికులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

వైవీయూ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు కడప ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం. జ్ఞానకుమార్ తెలిపారు. 10వ తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్ పాస్/ఫెయిల్ అయి 40 ఏళ్లలోపు కలిగిన మహిళలు, పురుషులు ప్రవేశాలు పొందేందుకు అర్హులన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ వివరాలను ఐటీఐ.ఏపీ.జీఓవి.ఇన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు జూన్ 6 లోపు తమ వివరాలను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం

- పేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- జెడ్పీ సమావేశంలో చైర్మన్ ఆకేపాటి, మంత్రి సురేష్





మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి.చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ విజయరామరాజు తదితరులు, సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : అకాల వర్షాల వల్ల జిల్లాలో పంటలు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకుంటామని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. గతనెల పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంట వివరాలు తయారు చేసి జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి పంపిందని పేర్కొన్నారు. నిన్నటిరోజు కురిసిన వర్షాల వల్ల సంభవించిన నష్టాలపై ఎన్యూమరేషన్ చేయాలని అధికారులకు చెప్పామన్నారు. ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లోనే పరిహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోమవారం చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన వైఎస్సార్ ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. పులివెందుల నియోజకవర్గంలో 2000 ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లిందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు. గతంలో కురిసిన వడగండ్ల వాన వల్ల దెబ్బతిన్న రైతులకు బీమా అందలేదన్నారు. పీఎం ఫసల్ బీమా పథకాన్ని తిరిగి అమలు చేయాలని కోరారు.

- కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ నిన్న కురిసిన వర్షాలకు కడప, పులివెందులలో నష్టాలు జరిగాయన్నారు. బద్వేలులో రేకుల షెడ్డు కూలి ఒకరు మృతి చెందారన్నారు. పులివెందుల నియోజకవర్గంలో 1917 హెక్టార్లలో 1007 మంది రైతులకు పంట నష్టం వాటిల్లిందని చెప్పారు.అన్నమయ్య ప్రాజెక్టు తెగినపుడు మృతి చెందిన బాధితులకు సీఎం పర్యటన రోజే పరిహారం ఇప్పించామని ఒక ప్రశ్నకు సమాధానంగా జెడ్పీ చైర్మన్ తెలిపారు. రోడ్లు వేయించామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్కడి పట్టా భూముల్లో మాత్రం ఇసుక మేటలు తొలగించామని చెప్పారు. గల్లంతైన వారి కుటుంబాలకు రూ. 1.65 కోట్లు పరిహారం ఇచ్చామన్నారు. డ్వాక్రా సంఘాలకు రూ. 8.98 కోట్ల రుణాలు రద్దు చేశామన్నారు. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు కొత్తగా స్థలాలు కేటాయించి గృహాలు మంజూరు చేశామన్నారు. వీఎన్ పల్లెలో ఒక జాతీయ బ్యాంకు, చెన్నూరు మండలం రామనపల్లెలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు.

8341 ఎకరాలకు పట్టాలు

అసైన్‌మెంట్‌పై జరిగిన చర్చకు మంత్రి సురేష్ బదులిస్తూ రైతులు సాగు చేసుకుంటున్న భూములకు మొదటి ప్రాధాన్యతనిస్తూ పట్టాలు ఇస్తామన్నారు. జిల్లాలోని శివాయిజమదారులకు 8341 ఎకరాల భూమిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జూన్ 15 తర్వాత అసైన్‌మెంట్ కమిటీ సమావేశం జరుపుతామన్నారు. వైఎస్ హయాంలో రాష్ట్రంలో 35 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ సమావేశం జరపకుండానే తమ కార్యకర్తలకు ప్రభుత్వ భూములను అప్పనంగా ఇచ్చుకున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా భూ పంపిణీ చేపడుతోందన్నారు.బి.మఠం జెడ్పీటీసీ, ఎంపీపీలు మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న వారు ఒకరైతే, ఆన్‌లైన్‌లో మరొకరి పేర్లు ఉన్నాయని తెలిపారు. 2018లో పుట్టిన పిల్లల పేరుతో కూడా పట్టాలిచ్చారని వీఎన్ పల్లె జెడ్పీటీసీ రఘునాథరెడ్డి చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అసిస్టెంట్ కలెక్టర్ తహసీల్దార్ ట్రెనింగ్ తీసుకోవాల్సి ఉన్నందున బి.మఠం, వీఎన్ పల్లెలకు పంపి ఇలాంటి కేసులను పరిష్కరిస్తామన్నారు రీ సర్వేపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 85 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. 18వే ల మందికి భూ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు.

చుక్కల భూములకు యాజమాన్య హక్కులు

జిల్లాలో 24,353 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి సాగు చేసుకుంటున్న రైతులకు యాజమాన్య హక్కులు కల్పిస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి సురేష్ తెలిపారు. తహసీల్దార్లు, వీఆర్వోలు యాక్టివ్‌గా లేనిచోట్ల చుక్కల భూములకు సంబంధించిన సమాచారం ప్రభుత్వ దృష్టికి రాలేదని, చుక్కల భూములు ఇంకా పెద్ద ఎత్తున జిల్లాలో ఉన్నాయని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా రెవెన్యూశాఖలో అన్యాయమైన పాలన సాగుతోందని ఎమ్మెల్సీ రామచంద్రయ్య ధ్వజమెత్తారు. ఎవరో ఒకరికి జరిగిన అన్యాయంపై కాకుండా ఓవరాల్‌గా మానిటర్ చేస్తే అందరికీ ప్రయోజనం లభిస్తుందన్నారు. జెడ్పీ సమావేశం వాయిదా గురించిన సమాచారం తనకు పంపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఆర్సీకి సమయం ఇవ్వాలన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షల్లో చాలాచోట్ల జీరో ఫలితాలు వచ్చాయని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆరోపించడంతో మరో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి గట్టిగా బదులిచ్చారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ 12 నాటికి నాడు–నేడు ఫేస్–3 పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 14 సంవత్సరాలు చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని చెప్పారు. ఆయన కాలంలో నారాయణ, శ్రీ చైతన్య మాత్రమే అభివృద్ధి చెందాయన్నారు. జగన్ మూడున్నర సంవత్సరాల్లో విద్య కోసం 35 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు.

తాగునీటి రవాణా బిల్లుల చెల్లింపు

ట్యాంకర్ల ద్వారా తాగునీరు రవాణా చేసిన వారికి ఏళ్ల గడుస్తున్నా బిల్లులు చెల్లించడం లేదని గాలివీడు ఎంపీపీ చెప్పారు. దీనికి మంత్రి బదులిస్తూ బిల్లుల అప్‌లోడ్, రికార్డింగ్ వంటి చెల్లింపుల ప్రక్రియను ఈ వారంలో ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.హౌసింగ్‌పై జరిగిన చర్చలో కలెక్టర్ మాట్లాడుతూ పట్టాలు తీసుకున్న వారందరూ ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. మంత్రి సురేష్ ఈ అంశంపై మాట్లాడుతూ జిల్లాలో లక్ష మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. మెటీరియల్ కాంపోనెంట్, మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పేదల సొంతింటి కల నిజం చేస్తామని చెప్పారు. సమావేశానికి ముందు జెడ్పీటీసీ మహేశ్వర్‌రెడ్డి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించిన నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులు తెచ్చిన జగన్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి కొనియాడారు. తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో నాటికి,నేటికీ చాలా తేడా కనిపిస్తోందన్నారు. ఇప్పుడు మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎక్కడైనా చిన్నలోపం ఉంటే దాన్ని ఒక వర్గం మీడియా భూతద్దంలోచూపి దిగజారుడు తనాన్ని ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. ఉపాధి పనులను 150 రోజులకు పెంచాలని సభ్యులు నాగార్జునరెడ్డి కోరారు. ఇరిగేషన్ డ్యాముల వద్ద ఔట్‌సోర్సింగ్ కిందైనా లస్కర్లను నియమించాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు.

21 రోజుల్లోనే పరిహారం ఇచ్చాం



ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు నెలల క్రితం ఉల్లి పంటకు నష్టం వాటిల్లితే 21 రోజుల్లోనే పరిహారం ఇచ్చి రైతులను ఆదుకున్న ప్రభుత్వం తమదన్నారు. రెండు వేల జనాభాకు ఒక ఆర్‌బీకే ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నామన్నారు. గతంలో వ్యవసాయం దండగ అన్న నాయకులు నిజాలు తెలుసుకుని మాట్లాడాలంటూ దెప్పి పొడిచారు. సోషల్ ఆడిట్ ద్వారా బీమా విషయంలో ఏ రైతుకు నష్టం జరగకుండా ప్రభుత్వం చూస్తోందన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ బద్వేలులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ బదులిస్తూ బద్వేలు, జమ్మలమడుగు, రాజంపేటలలో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

ఎస్‌పీఏతో వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ఎంఓయూ



ఒప్పంద పత్రాలు చూపుతున్న వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ : విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏ)తో కడప వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ డైరెక్టర్ ఆచార్య కొండా రమేష్ ఆధ్వర్యంలో ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ 5 సంవత్సరాల పాటు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అకడమిక్ అంశాలతో పాటు పరిశోధనకు సంబంధించిన కార్యకలాపాల్లో రెండు సంస్థలు కలిసి పనిచేస్తాయన్నారు. కన్సల్టెన్సీ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి, యూజీ, పీజీ కోర్సుల్లో సహకారం అందించుకునేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో భాగస్వామ, విద్యార్థులకు మెటీరియల్, వెబినార్లు, ఉపన్యాసాలు, విద్యార్థుల జ్ఞాన మార్పిడి, నైపుణ్య సంబంధిత అంశాలపై ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ పి. అవినాష్‌రెడ్డి, విజయవాడ ఎస్‌పీఏ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, డా. ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గండి ఆలయానికి రూ.49.5 లక్షల ఆదాయం

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం జరిగిన టెండర్ల ద్వారా ఆలయానికి రూ. 49,55,000లు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.ఆలయం వద్ద ఏడాది కాలం పాటు పూలు విక్రయంచు కొనే నిమిత్తం విజయకుమార్ రూ.16,05,000లతో హక్కు దక్కించుకున్నట్లు చెప్పారు. కొబ్బరి చిప్పలు సేకరించు కొనే నిమిత్తం శివప్రసాదరెడ్డి రు.15,50,000లకు హక్కు దక్కించుకున్నారన్నారు. ఆలయానికి వచ్చే వాహనాలకు సంబంధించి టోల్ గేట్ వసూలు చేసుకునేందుకు నాగరాజు రు.18,00,000లకు హక్కు పొందారన్నారు. ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, దేవదాయ శాఖ కడప ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, అర్చకులు కేసరి,రాజారమేష్, రాజగోపాలాచార్యులు, ఆర్కే వ్యాలీ ఎస్సై రంగారావు,చక్రాయపేట ఏపీజీబీ మేనేజరు అశోక్ పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లోనే ఉండిపోతా !

- చివరి కోరిక తీరకనే కన్నుమూసిన నటుడు శరత్‌బాబు
- విచారం వ్యక్తం చేస్తున్న స్థానికులు



శరత్‌బాబు (ఫైల్)



హార్సిలీహిల్స్‌పై శరత్‌బాబు అసంపూర్తి ఇల్లు

బి.కొత్తకోట : ఇంటి నిర్మాణం పూర్తి చేయించి హార్సిలీహిల్స్ పైనే ఉండిపోతా అని చెప్పిన నటుడు శరత్‌బాబు (72) కు ఆ కోరిక తీరకనే కన్నుమూశారు. అనారోగ్యంతో కొంత కాలంలో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌తో ఎక్కువ అనుబంధం కలిగిన నటుల్లో కృష్ణ తర్వాత శరత్‌బాబు ముఖ్యుడు. నటుడుగా బిజీగా ఉన్న సమయంలోనే శరత్‌బాబుకు హార్సిలీహిల్స్‌తో దశాబ్దాల అనుబంధం ఉంది. 1980ల్లోనే హార్సిలీహిల్స్ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో సభ్యత్వం పొందారు. ఈ సభ్యత్వంతో 16–4–1985లో ఆయనకు కొండపై మానస సరోవరం పక్కన ఇంటి నివేశనస్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో అప్పట్లోనే ఇంటి నిర్మాణం ప్రారంభించినా పూర్తి చేయకపోవడంతో గోడల వరకే నిర్మాణం ఆపివేశారు. ఈ ఇంటిని కొనుగోలు చేస్తామని, విక్రయించాలని పలువురు కలిసినా విక్రయించడానికి సుముఖత వ్యక్తం చేసేవారు కాదు. ఇంటి నిర్మాణం పూర్తి చేయించకపోవడం, అలాగే వదిలేయడంతో దాన్ని సంరక్షించే బాధ్యతను స్థానిక వ్యక్తికి అప్పగించారు. అతను తరచూ ఫోన్‌లో శరత్‌బాబుతో మాట్లాడేవారు.

నెరవేరని చివరి కోరిక

శరత్‌బాబు ఏటా హార్సిలీహిల్స్ వచ్చి అసంపూర్తిగా ఉన్న ఇంటిని చూసుకుని, స్థానికులతో ముచ్చటించేవారు. ఆయన చివరగా 2021 మార్చి, 24న హార్సిలీహిల్స్ వచ్చారు. ఆరోజు తనకు పరిచయం ఉన్న స్థానికులతో మాట్లాడారు. పలు చిత్రాల్లో నటిస్తున్నానని, ఆ చిత్ర నిర్మాణాలు పూర్తయ్యాక హార్సిలీహిల్స్‌కు వచ్చేసి కుటుంబంతో ఇక్కడే ఉండిపోతానని అప్పుడు చెప్పారు. ఆ రోజు సాయంత్రం తిరిగి వెళ్లాక శరత్‌బాబు హార్సిలీహిల్స్ రాలేదు. ఆదే చివరిరోజైంది.

ఫోర్జరీతో ఇంటి విక్రయం

హార్సిలీహిల్స్‌పై శరత్‌బాబు ఇంటిని చిన్నా అనే వ్యక్తి ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నితో నాగార్జునరెడ్డికి విక్రయించారు. 15 ఏళ్ల క్రితం ఈ సంఘటన జరిగింది. అప్పటి బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ విక్రయ దస్తావేజును రిజిష్టర్ చేయడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శరత్‌బాబు ఫిర్యాదు చేయగా క్రిమినల్ కేసు నమోదైంది. దస్తావేజు రిజిష్టర్ చేసిన సబ్‌రిజిస్ట్రార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయగా కేసు కోర్టులో నడిచింది. కేసులో నిందితులపై చర్యలు తీసుకోగా రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడంతో ఇల్లు శరత్‌బాబుకే దక్కింది.

శేషజీవితం కొండపైనే అనుకున్నారు

శరత్‌బాబు, నేను చాలాసేపు మాట్లాడుకున్నాం. వ్యక్తిగత, సినిమా విషయాలు చెప్పేవారు. హార్సిలీహిల్స్‌పై నివసించాలని ఉందని, దీనికి ఏర్పాట్లు కూడా చేసుకుంటానని చెప్పారు. ఇంటి నిర్మాణం పూర్తి చేయిస్తానని అన్నారు. కుటుంబంతో కలిసి శేషజీవితం గడపాలని అనుకుంటున్నట్టు ఓసారి చెప్పారు. సరదాగా మాట్లాడేవారు.

– నేదురుమల్లి సాల్వీన్‌రెడ్డి, టూరిజం మేనేజర్, హార్సిలీహిల్స్

అకాల వర్షం.. అపార నష్టం

- అకాల వర్షం, గాలులతో తీవ్ర నష్టం
- రాలిన మామిడి కాయలు, ధ్వంసమైన అరటితోటలు

వైఎస్సార్, అన్నమయ్యజిల్లాల్లో అకాల వర్షాలు, ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి.ఆరుగాలం పడిన కష్టానికి పంట చేతికొస్తుందనుకుంటున్న సమయంలో రైతుల ఆశలను గల్లంతు చేశాయి. ఈదురుగాలులతో కోతకు వచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



పులివెందుల రూరల్ : గాలులకు దెబ్బతిన్న అరటితోట



రాయచోటిటౌన్ : గాలివానకు నేలకూలిన మామిడి చెట్లు

పులివెందుల రూరల్ : ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షానికి మండలంలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, మల్లికార్జునపురం, మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం, వెలమవారిపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. పంట చేతికందే సమయంలో గాలుల వల్ల అరటి కాయలు, చెట్లు ఎందుకు పనికిరాకుండా పోయాయని రైతులు వాపోతున్నారు.ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

- గాలులకు పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. కడప రోడ్డులోని మెడికల్ కళాశాల వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు పడిపోయిన స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు.

లింగాల :

లింగాల మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు లింగాల, రామనూతనపల్లె, ఎగువపల్లె, అంబకపల్లె, చిన్నకుడాల, కర్ణపాపాయపల్లె, వెలిదండ్ల, కోమన్నూతల, ఇప్పట్ల తదితర గ్రామాల్లో 358హెక్టార్లలో 457 మంది రైతులు అరటి పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. సుమారు కోటి రూపాయల నష్టం వాటిల్లిందని హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. ప్రస్తుత ప్రాథమిక అంచనా వేసినట్లు చెప్పారు.

1032 హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఆదివారం కురిసిన అకాల వర్షంతో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 1154 మంది రైతులకు సంబంధించిన 1032.20 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. మైదుకూరు మండలంలో 5 హెక్టార్లలో ఏడుగురు రైతులకు చెందిన అరటి, దువ్వూరు మండలంలో 3 మెక్టార్లలో ఐదుగురికి చెందిన మునగపంట, కొండాపురం మండలంలో 52.40 మెక్టార్లలో 70 మందికి చెందన అరటి, పులివెందుల మండలంలో 368 హెక్టార్లలో 345 మంది రైతులకు చెందిన అరటి, 40 హెక్టార్లలో 35 మందికి చెందిన మిరప పంట, వేముల మండలంలో 151 హెక్టార్లలో, వేంపల్లె మండలంలో 40 హెక్టార్లలో, సీకేదిన్నె మండలంలో 14 హెక్టార్లలో అరటిపంట దెబ్బతింది.ఉద్యానశాఖ అధికారులు ప్రాథమిక నష్టపరిహార అంచనాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు.

పులివెందులలో 76 మి.మీ వర్షం

జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. ఇందులో పులివెందుల్లో అత్యధికంగా 76 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెన్నూరులో 24.4 , కలపపాడులో 20.6, కాశినాయనలో 16.4, వేములలో 19.0, బి. మఠం, తొండూరులో 9.6, బి కోడూరులో 9.2, ప్రొద్దుటూరులో 6.6, మైదుకూరులో 6.2, బద్వేల్‌లో 5.6 , ముద్దనూరులో 5.4, లింగాల్లో 5.2, గోపవరంలో 4.6, కొండాపురం, దువ్వూరులో 4.2 మిల్లీమీట్ల వర్షపాతం నమోదైంది

రాజంపేట రూరల్ : ఆదివారం వీచిన ఈదురుగాలులకు అన్నమయ్య జిల్లా రాజంపేట మండల పరిధిలోని ఆకేపాడు, హస్తవరం రైతు భరోసా కేంద్రాల పరిధిలో 27 మంది రైతులకు చెందిన 64 ఎకరాల్లో అరటిపంట నేలకొరిగింది. ఆకేపాడు ఆర్‌బీకే పరిధిలో 10 మందికి చెందిన 25 ఎకరాల్లో, హస్తవరంలో 12 మందికి చెందిన 27 ఎకరాల్లో, మిట్టమీదపల్లి ఆర్‌బీకే పరిధిలో 5 మందికి చెందిన 12 ఎకరాల్లో అరటి పంట నేల కొరిగినట్లు, రూ.64 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన అధికారి జీ సురేష్‌బాబు సోమవారం తెలియజేశారు.

వీరబల్లె/ సుండుపల్లె (రాయచోటిటౌన్) : ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఈదురు గాలులతో కూడిన వానలు కురవడంతో సుండుపల్లె, వీరబల్లె మండలాల్లో మామిడి చెట్లు నేలకొరిగాయి.వానతో పాటు ఈదురు గాలులు కూడా తోడవడంతో కోతకు సిద్ధంగా ఉన్న కాయలన్నీ రాలిపోయియి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

అరటి పంట పరిశీలన



నేలకూలిన అరటి పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ, తదితరులు

వేంపల్లె : ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, అకాల వర్షానికి మండలంలోని బక్కన్నగారిపల్లె, టి.వెలమవారిపల్లె గ్రామాల్లో అరటి పంట దెబ్బతింది. సోమవారం హెచ్‌ఓ రెడ్డయ్య ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ సిబ్బంది దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక నష్ట నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. సుమారు 42మంది రైతులకు సంబంధించి 40ఎకరాల్లో అరటి పంట పాక్షికంగా దెబ్బతిందని.. దీంతో రూ.40లక్షల మేర నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

హౌసింగ్ లక్ష్యాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో నిర్దేశిత హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో గృహ నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని ప్రభుత్వ పాఠశాల వెనుక వైపున ఉన్న మురికి నీటి కాల్వ వద్ద పాత పునాది దిమ్మెలపై గుర్తు తెలియని మగ మృతదేహం లభ్యమైనట్లు సికెదిన్నె ఎస్ఐ బి. అరుణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన సమాచారం మేరకు.. సదరు గుర్తు తెలియని వ్యక్తి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల లోపల ఉంటుందని.. ఈ వ్యక్తి లేత బ్లూ కలర్ రెడిమేడ్ ఫుల్ షర్ట్‌తో పాటు సిమెంట్ కలర్ షాట్ వేసుకొని ఉన్నాడన్నారు. ఈ వ్యక్తి మద్యం మత్తులో పునాది దిమ్మెలపై పడి ముక్కు బెదిరి ముక్కులో నుంచి రక్తం కారి మృతిచెందినట్లుగా ఉందన్నారు. మామిళ్ళపల్లె పంచాయితీ వీఆర్ఏ వెంకట సుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలిసిన వారు 9121100526, 9121100525 నెంబర్లకు తెలపాలన్నారు.

ప్రజల గుండెల్లో 'పెద్దాయన'

- వైఎస్సార్ రాజకీయ అభివృద్ధికి తోడ్పాటు
- పులివెందుల గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి
- పులివెందుల పెద్దాయనగా ప్రజల మన్ననలు
- నేడు దివంగత వైఎస్ రాజారెడ్డి 25వ వర్ధంతి
- నివాళులర్పించనున్న వైఎస్ కుటుంబీకులు


దివంగత వైఎస్ రాజారెడ్డి, వైఎస్ జయమ్మ

పులివెందుల : పులివెందుల చరిత్రలో పెద్దాయనది ఒక ప్రత్యేకత. పేద ప్రజలకు.. తమ కుటుంబాన్ని నమ్ముకున్నవారికి అండగా నిలిచేవారు. కరువు లాంటి విపత్కర పరిస్థితులలోనూ ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు దివంగత వైఎస్ రాజారెడ్డి. వైఎస్ రాజారెడ్డి 1925 సంవత్సరంలో వెంకటరెడ్డి, మంగమ్మ దంపతులకు జన్మించారు. ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ అందరినీ ఏకతాటిపై నడిపించిన వైఎస్ రాజారెడ్డికి పులివెందుల పెద్దాయనగా పేరు వచ్చింది. పులివెందుల అభివృద్ధికి సంబంధించి గ్రామ సర్పంచ్‌గా ఆయన ఎనలేని సేవలు అందించారు. క్రమశిక్షణ గల కార్యకర్తలను తీర్చిదిద్దడంలోనూ కుమారులు, కుమార్తెలు ఉన్నతస్థానంలో నిలపడంలోనూ కుటుంబ పెద్దగా పెద్దాయన పాత్ర ఎనలేనిది.

పులివెందుల గ్రామ సర్పంచ్‌గా..

రాజకీయాల్లోకి రాకమునుపు నుంచి పులివెందుల్లో వై.ఎస్.రాజారెడ్డికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎలాంటి సమస్య అయినా ఆయన దగ్గరికి వెళితే పరిష్కారమవుతుందని ప్రజల నమ్మకం. ఈ నాటికీ ఆయన వెంట ఉన్న అభిమానులు రాజారెడ్డిని దేవునిగా కొలుస్తున్నారంటే ఎంత ఆరాధిస్తున్నారో అర్థమవుతోంది.

■ ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన రాజారెడ్డి పులివెందుల గ్రామ సర్పంచుగా ఎన్నికై ప్రజాప్రస్థానం ప్రారంభించారు. ఆయన పులివెందుల సర్పంచ్‌గా 1988 నుండి 1995 వరకు పని చేశారు. ఆయన సర్పంచ్‌గా ఉన్న సమయంలోనే పులివెందులలో వీధిలైట్లు, రోడ్లు, విద్యా సంస్థలను ఏర్పాటు చేయడంతోపాటు చెరువులను తవ్వించారు. పులివెందుల్లో అభివృద్ధి పనులు చేపడుతూనే ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేవారు. అలనాడు సర్పంచ్‌గా పనిచేస్తున్న సమయంలో పులివెందుల్లో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చినప్పుడు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి నీటిసమస్య తీర్చడమే కాదు.. రాష్ట్రంలోనే ఇలాంటి సమస్య ఎప్పుడూ రాకూడదని పుత్రులకు హితబోధ చేసిన మహా మనిషి ఆయన. గ్రామ ప్రజలకు సమస్యలు రాకుండా పోరాడుతూనే మరోవైపు తన ఆశయాల సాధనకు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తన సుపుత్రులలో ఇద్దరిని ప్రజల కోసం అంకితం చేశారు.

■ తన కుమారుడు వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ ఉన్నతికి ఆయన ఎంతో కృషి, తోడ్పాటు అందించారు. పులివెందుల ప్రాంతంలో ప్రత్యేకంగా వైఎస్ రాజారెడ్డి పేరుతో కాలనీలు కూడా వెలిశాయి.

పులివెందుల ప్రజల మనసులో ప్రత్యేక స్థానం

పులివెందుల పరిధిలో దివంగత వైఎస్ రాజారెడ్డి, దివంగత జయమ్మ దంపతులు ప్రజల మనసులో ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నారు. వైఎస్ రాజారెడ్డి బతికున్న కాలంలో ఈ ప్రాంత ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండేవారు. వైఎస్ఆర్ రాష్ట్ర రాజకీయాల్లో తలమునకలై ఉండగా.. వైఎస్ రాజారెడ్డి పులివెందుల ప్రాంతంలో ప్రజల సమస్యలపట్ల, రాజకీయాలపట్ల అన్నీ తానై చూసుకొనేవారు. దీంతో వైఎస్ఆర్ రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించగలిగారు. వైఎస్ రాజారెడ్డి తనయుడు వైఎస్ఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని తపించేవారు.

విద్యా ప్రదాతగా..

వైఎస్ రాజారెడ్డి పులివెందుల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తూనే పులివెందులలో పేద విద్యార్థుల కోసం డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు నెలకొల్పారు. ప్రజలకు సేవ చేయడంలో ఆయన ఎంతో తృప్తి పొందేవారు. వైఎస్ రాజారెడ్డి, వైఎస్సార్ చూపిన బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని ప్రజలు కొనియాడుతున్నారు. ప్రజలు ఈ నాటికీ పులివెందుల పెద్దాయన వైఎస్ రాజారెడ్డిని గుర్తుచేసుకుంటూనే ఉన్నారు.

ఘన నివాళులర్పించనున్న వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతమ్మ

దివంగత వైఎస్ రాజారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పులివెందులలోని డిగ్రీ కళాశాల రోడ్డులో గల వైఎస్సార్ సమాధుల తోటలో గల వైఎస్ జయమ్మ, వైఎస్ రాజారెడ్డి సమాధుల వద్ద వైఎస్సార్ కుటుంబీకులు, వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతమ్మలతోపాటు ఇతర కుటుంబ సభ్యులు నివాళులర్పించనున్నారు. అనంతరం వైఎస్ రాజారెడ్డి పార్కులోని వైఎస్ రాజారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించనున్నారు. అనంతరం జీసెస్ చారిటీస్‌లో గల చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

అక్షర యోధుడు కేతు


కేతు విశ్వనాథ్‌రెడ్డి (ఫైల్)

కడప కల్చరల్ : సాహితీ దిగ్గజం ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మరణం పట్ల సాహితీ లోకంలో సంతాపం వెల్లువెత్తుతోంది. సాహితీవేత్తలతోపాటు వామపక్షాల నాయకులు, ప్రజాసంఘాలు సంతాపం వ్యక్తం చేస్తున్నాయి. తెలుగు సాహిత్యంలో దీపధారిని, దిక్సూచిని కోల్పోయామని, ఆ లోటు తీరేది కాదని విచారం వ్యక్తం చేస్తున్నారు. పలువురు ఆయనతో గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

నమ్మలేకపోతున్నాం

నా నవల పరిచయ సభకు ముఖ్య అతిథిగా రావాల్సిన వ్యక్తి మరునాడు ఇక లేరన్న వార్త తెలియడం నమ్మలేకపోతున్నా. ఆధునిక తెలుగు కథకు పరిపూర్ణ జవసత్వాలు కల్పించిన కథా శిల్పి కేతు.

- డాక్టర్ శాంతి నారాయణ, రచయిత, అనంతపురం

కథలంటే మధ్యతరగతి జీవితాలే..

కథలంటే మధ్యతరగతి మనుషుల జీవితాలేనని భావించాను. ఆచార్య కేతు కథల్లో గ్రామాల్లోని వ్యథలను కథలుగా రాయడంతో నేను ఆ వైపు మొగ్గి కథకుడినయ్యాను.

- పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, కథా రచయిత

బహుముఖ ప్రజ్ఞాశాలి

సీమ సంస్కృతి, గొప్పదనం, ఈ ప్రాంతగ్రామీణ జీవనశైలిని కథల్లో చూపిన తొలి వ్యక్తి ఆచార్య కేతు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, సాహితీ, పాత్రికేయ రంగాలకు ఆయన చేసిన సేవలు మరువలేం.

- డాక్టర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి, అధ్యక్షులు, అరసం కడపజిల్లాశాఖ

కేతు కథ.. సజీవ సాక్ష్యం

కేతు విశ్వనాథరెడ్డి నిన్నటివరకు సజీవం. నేడు ఓ జ్ఞాపకం. సీమ పల్లెల్ని, మట్టిపరిమళాల్ని, ఆక్రోశాన్ని ఎలా అర్థం చేసుకోవాలో, కరువు, కక్షలు ఇక్కడి గ్రామాల్ని ఎలా ఛిద్రం చేశాయో ఆయన కథల్లో చూడవచ్చు.

- సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, ప్రముఖ కథా రచయిత

కూలిన బురుజు

తెలుగు కథ ఘనతకు నిదర్శనంగా నిలిచిన ఓ సాహితీ బురుజు కూలిపోయింది. ఎందరో యువ రచయితలకు మార్గదర్శకుడు. తెలుగు సాహితీ జగత్తుకు ఆయన మార్గదర్శనం చేశారు.

- తవ్వా ఓబుల్‌రెడ్డి, రచయిత

యుగకర్త

ఆచార్య కేతు తెలుగు కథకు యుగకర్త. సాహిత్య విమర్శకునిగా, గొప్ప పరిశోధకునిగా ఆయన ఎందరో యువ కథకులకు దారి దీపం అయ్యారు. బడుగు, బలహీన వర్గాల పక్షం వహించారు.

- డాక్టర్ తవ్వా వెంకటయ్య, సభ్యులు అధికారభాష సంఘం

శ్రామిక-ప్రజాపక్షపాతి

ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి శ్రామిక, ప్రజాపక్షపాతి. ఎన్నోసార్లు బీమా ఉద్యోగుల ప్రచార ఆందోళనకు సంఘీభావం తెలిపారు. నిరంతర అధ్యయనం, పరిశోధన, రచనతో ఆయన శ్రామిక జనం పక్షపాతిగా నిలిచారు.

- రఘునాథరెడ్డి, ఎల్ఐసీ యూనియన్ నేత

'బ్రౌన్'కు ఎంతో చేశారు

సీపీ బ్రౌన్ గ్రంథాలయం తొలి ఇటుక స్థాయి నుంచి నిన్నటి రజతోత్సవాల వరకు ఆయన ప్రోత్సాహం ఉంది. సలహా మండలి సభ్యులుగా ఈ భాషా పరిశోధన కేంద్రం అభివృద్ధి వెనుక ఆయన కృషి ఉంది.

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సంచాలకులు, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం

కాలనీ అంతా కన్నీటిమయం

పదేళ్ల క్రితం ఆచార్య కేతు హైదరాబాదు నుంచి వచ్చి కడప శాటిలైట్ సిటీలో స్థిరపడ్డారు. కాలనీ మొత్తం తమ ఆత్మ బంధువు ఇక లేరన్న విషయం తెలిసి కన్నీటిమయమైంది.

- వై.ప్రభాకర్‌రెడ్డి, శాటిలైట్ సిటీ వాసి, కడప

దొంగల కోసం ముమ్మర గాలింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో జరిగిన చోరీ ఘటనకు సంబంధించి కేసును ఛేదించేందుకు ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు సాక్షితో మాట్లాడుతూ దొంగల ఆచూకీకి సంబంధించి క్లూ కోసం అనేక ప్రయత్నాలు సాగిస్తున్నామని, త్వరలో వారిని అరెస్టు చేస్తామని ఆయన తెలియజేశారు.

మైనర్ బాలికపై దాడి

వేర్వేరుగా రెండు కేసులు నమోదు


రౌడీషీటర్ ఉత్తయ్య(ఫైల్)

గుర్రంకొండ : మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ ఎగువ దళితవాడ సమీప పొలంలో గత ఆదివారం జరిగిన మైనర్ బాలికపైదాడి, గ్రామస్తుల మూకుమ్మడి దాడిలో రౌడీషీటర్ మృతి చెందిన సంఘటనల్లో వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేసినట్లు సోమవారం ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

■ టి.పసలవాండ్లపల్లె పంచాయతీ ఉదారవాండ్లపల్లెకు చెందిన వి. చలపతికి అదే పంచాయతీ ఎగువ దళితవాడకు చెందిన ఉత్తయ్య(50)కు పొలం దారి విషయమై గతంలో వాగ్వివాదం చోటుచేసుకొంది. అప్పట్లో ఈవివాదాన్ని గ్రామపెద్దలు తాత్కాలింగా పరిష్కరించి సద్దుమనిచారు. ఈనేపథ్యంలో చలపతి కుటుంబంపై ఉత్తయ్య కక్ష్య పెంచుకొన్నాడు. ఈనెల 21న చలపతి మనవరాలు వి. మహేశ్వరీ (13), అతని మనవడు ఇద్దరు కలిసి పొలం వద్ద పాడి ఆవులు మేపుకొంటున్నారు. చలపతి మనవడు సాయంకాలం ఇంటికి చేరుకోగా మహేశ్వరీ ఒక్కటే పొలం వద్ద ఉంది. ఈవిషయాన్ని గమనించిన ఉత్తయ్య మహేశ్వరిపై అత్యాచార యత్నానికి పాల్పడడం కోసం ఒక్కసారిగా కత్తితోదాడి చేశాడు. ఈ దాడిలో మహేశ్వరి తలపై చెవులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితురాలు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో యాక్టు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

టి.పసలవాండ్లపల్లె పంచాయతీ ఎగువ దళితవాడకు చెందిన ఉత్తయ్య(50) పాత నేరస్తుడు. ఇటీవల ఆరునెలల క్రితం బెంగుళూరు నుంచి గ్రామానికి చేరుకొన్నాడు. ఇక్కడ మద్యానికి బానిసై అందరిపై దౌర్జన్యం చేయడం. బెదరించడం వంటి చర్యలకు పాల్పడేవాడు. ఈనేపథ్యంలోనే చలపతి మనవరాలిపై ఉత్తయ్య దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆగ్రహించిన చలపతి కుటుంబసభ్యులతోపాటు మరికొంత గ్రామస్తులు పొలం వద్దకు చేరుకొని ఉత్తయ్యపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈదాడిలో ఉత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. జరిగిన సంఘటనపై మృతుడి సోదరుడు విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఉత్తయ్య జీవితం నేరమయం

మైనర్ బాలికపై దాడి చేసి తదనంతరం గ్రామస్తుల రాళ్ల దాడిలో మృతి చెందిన రౌడీషీటర్ ఉత్తయ్య జీవితం నేర మయం. పోలీసుల కథనం మేరకు.. ఉత్తయ్యకు చిన్నమండ్యం మండలం కలిబండకు చెందిన దేవితో వివాహమైంది. వీరికి నలుగురు సంతానం. భార్య భర్తల మధ్య చిన్న పాటి వివాదాలు చెలరేగాయి. దీంతో 2008లో దేవిని ఆమె పుట్టినిల్లు అయిన కలిబండలో ఉత్తయ్య హత్య చేశారు. అప్పట్లో ఇతని కేసు నిరూపణ జరిగి కడప సెంట్రల్‌జైల్‌లో 11 ఏళ్లు కారాగార శిక్ష అనుభవించి 2019లో జైలు నుంచి విడుదల అయ్యాడు. ఇతనిపై చిన్నమండ్యం పోలీస్‌స్టేషన్లో రౌడీషీటర్ నెం. 370గా నమోదు అయి ఉంది. అప్పటి నుంచి తన మకాం బె బెంగుళూరుకు మార్చి అక్కడ తమ బంధువుల మహిళతో కలిసి రెండేళ్లు ఉన్నాడు. ఆరునెలల క్రితం బెంగుళూరులో తనతో ఉన్న మహిళతో గొడవపడి ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈసంఘటనపై బెంగుళూరులో ఉత్తయ్యపై కేసు నమోదు అయ్యింది. అక్కడి నుంచి పారిపోయి మళ్లీ సొంత గ్రామమైన ఎగువ దళితవాడకు చేరుకొన్నాడు. కర్నాటక పోలీసులు హత్యాయత్నం కేసుకు సంబంధించి ఇతని కోసం గాలిస్తూనే ఉన్నారు. ఆరునెలల క్రితం గ్రామానికి చేరుకొన్న ఉత్తయ్య ఇక్కడ నేర ప్రవృత్తినే కొనసాగించాడు. గ్రామస్తులను బెదిరించడం, దౌర్జన్యం చేయడం చేస్తుండేవాడు. ఈ నేపథ్యంలోనే చలపతి పొలం విషయం గొడవడ పడి అతడి మనవరాలిపై కత్తితో దాడి చేశాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఉత్తయ్యపై దాడి చేసి హతమర్చారు.

చీనీ చెట్లు నరికివేత



కొండాపురం: మండల పరిధిలోని బి. కొత్తపల్లె గ్రామ సమీపంలో తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పుల్లయ్య తోటలో 300 చీనీచెట్లను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ జె.రవికుమార్ తెలిపారు. సోమవారం చీనీ చెట్లను నరికిన తోటను సీఐ సుదర్శన్ ప్రసాదు, ఎస్ఐ పరిశీలించారు. తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పుల్లయ్య కు బి. కొత్తపల్లె గ్రామ సమీంలో 2.75 ఎకరాలు చీనీ తోట ఉంది. మొత్తం 300 చీనీ చెట్లు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు చీనీచెట్లను నరకడంతో ఈఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి

మదనపల్లె: సిమెంటు కోర్ లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి విషమ పరిస్థితిలో ఉన్న సంఘటన ఆదివారం అర్ధరాత్రి తంబళ్లపల్లె మండల పరిధిలోని కడప - బెంగుళూరు జాతీయ రహదారి రెడ్డికోట వద్ద జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు... చిన్నమండ్యం మండలం బోనమల పంచాయతీ కాయలవాండ్లపల్లెకు చెందిన కారు డ్రైవర్ దేరంగుల చంద్రశేఖర్ (32), చిన్నమండ్యంలో కోళ్ల వ్యాపారం నిర్వహించే పెద్దయ్య(33), అతని స్నేహితుడు మణికంఠ(33) ముగ్గురు కలిసి బెంగుళూరులో పెద్దయ్య స్నేహితుల వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్లారు. ఆదివారం రాత్రి వివాహ అనంతరం చిన్నమండ్యానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో తంబళ్లపల్లె మండల పరిధిలోని కడప-బెంగుళూరు జాతీయరహదారిపై రెడ్డికోట సమీపంలో, కడప జిల్లా ఎర్రగుంట్ల నుంచి బెంగుళూరుకు సిమెంటులోడుతో వెళుతున్న కోర్ లారీ ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కోర్ లారీ ప్రమాదంలో బోల్తాపడగా, కారు నుజ్జునుజ్జయింది. అర్ధరాత్రి ప్రమాదం జరగడంతో వెంటనే గుర్తించలేకపోయారు. అనంతరం ప్రమాదాన్ని గుర్తించిన వాహనదారులు క్షతగాత్రులను అతి కష్టం మీద కారులో నుంచి తీశారు. సంఘటన స్థలానికి చేరుకున్న తంబళ్లపల్లె ఎస్.ఐ చంద్రమోహన్ బాధితులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రెడ్డిశేఖర్ మృతి చెందగా, పెద్దయ్య, మణికంఠ పరిస్థితి విషమంగా మారింది. ఆస్పత్రికి చేరుకున్న పెద్దయ్య కుటుంబసభ్యులు బాధితుడిని బెంగుళూరుకు తరలించారు. మణికంఠను తిరుపతి రూయాకు తరలించారు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ చంద్రమోహన్ తెలిపారు. మృతి చెందిన రెడ్డిశేఖర్‌కు భార్య ధనమ్మ, కుమార్తె శ్రావణి, పేరు పెట్టని 5 నెలల బాబు ఉన్నారు. రెడ్డిశేఖర్ ఒక్కగానొక్క కొడుకు కావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో కన్నీటిపర్యంతమయ్యారు.

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

మదనపల్లె: ట్రాక్టర్ డ్రైవర్ గాయపడ్డాడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం నగిరిమిట్టపల్లెకు చెందిన శ్రీనివాసులు(40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ట్రాక్టర్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందేందుకు పుంగనూరు ఆర్టీఓ ఆఫీసుకు ట్రాక్టర్‌లో బయలుదేరాడు. గేర్‌లాక్ అయి ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌లో నుంచి కిందపడి గాయపడ్డాడు.

బైక్‌ను ఢీకొన్న కారు



విష్ణుచైతన్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, ప్రమాదంలో మృతి చెందిన విజయ

ఇద్దరు మృత్యువాత

వేముల : వేముల మండలం చాగలేరు గ్రామ సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిట్టిబోయిన విష్ణుచైతన్య (21), ఇరగల విజయ (42) లు మృతి చెందగా.. మరో వ్యక్తి శివకుమార్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని చాగలేరుకు చెందిన చిట్టిబోయిన విష్ణుచైతన్య, శివకుమార్‌రెడ్డిలు బైక్‌పై పనిమీద కొత్తపల్లె గ్రామానికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో చాగలేరు గ్రామానికి చెందిన విజయ చాగలేరు క్రాస్ వద్ద గ్రామానికి వెళ్లేందుకు వేచి ఉంది. అదే సమయంలో విష్ణుచైతన్య, శివకుమార్‌రెడ్డిలు చాగలేరు గ్రామానికి వెళుతుండగా.. మార్గ మధ్యలో చాగలేరు క్రాస్ వద్ద చాగలేరుకు వెళ్లేందుకు విజయ బైక్ ఎక్కి ముగ్గురు గ్రామానికి బయలుదేరారు. గ్రామ సమీపానికి వెళ్లాక.. చాగలేరు గ్రామం వైపు నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణుచైతన్య, విజయ అక్కడికక్కడే మృతి చెందగా.. శివకుమార్‌రెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి మృతురాలి విజయ సోదరుడు భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు.

వేప చెట్టు మీదపడి వ్యక్తికి గాయాలు

సిద్దవటం : మండలంలోని డేగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన నిమ్మకాయల మునిరెడ్డి అనే వ్యక్తిపై వేప చెట్టు పడి తీవ్రగాయాలయ్యాయని మునిరెడ్డి ఆదివారం సాయంత్రం తన పొలంలోని వరిగడ్డి వామి వద్ద ఉండటంతో అక్కడే ఉన్న వేపచెట్టు ఈదురు గాలులకు పెద్ద కొమ్మ విరిగి మునిరెడ్డిపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం కడపలోని ప్రవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

గృహిణిగా ఇంటి బాధ్యతలు మహిళలకు ఎలాగూ తప్పదు.
ఇక ఆదాయ మార్గం గురించి ఆలోచించడం, వాటిని అమలులో పెట్టడం అంటే తగిన వనరులే కాదు ఇంటిల్లిపాదీ అందుకు సహకరించాలి.
హైదరాబాద్ బండ్లగూడ నాగోల్‌లో ఉంటున్న ఆర్.రాజేశ్వరి ని కలిసినప్పుడు ‘పదేళ్లుగా చేస్తున్న పచ్చళ్లు, పొడుల వ్యాపారం... ఆదాయంతో పాటు బిజినెస్ ఉమన్‌గానూ గుర్తింపును తెచ్చిపెట్టింది’ అని వివరించింది.

కాదేది ఉపాధికనర్హం!

ఇంటి పచ్చళ్లతో ఇల్లు దిద్దుకుంది


● రాజేశ్వరి



‘మన ఇళ్లల్లో అన్ని కాలాల్లోనూ ఏవో ఒక పచ్చళ్లు పెట్టడం అనేది గృహిణులకు అలవాటైన పనే. ఇంట్లో నేనూ అలాగే చేస్తుండే దాన్ని. నా చేతి పచ్చళ్లు రుచికరంగా ఉంటాయని ఇంట్లోనూ, బంధుమిత్రులు, చుట్టుపక్కల వాళ్లు బాగా మెచ్చుకునేవారు. అడిగి మరీ చేయించుకునేవారు. దీనికి తోడు నాకు తెలిసిన వాళ్లు విదేశాలకు వెళ్లినప్పుడు తమకు నచ్చిన పచ్చడి, పొడులు తయారు చేసిమ్మని అడిగేవారు.

పదేళ్ల క్రితం...

నోటి మాటతోనే ఒకరొకరుగా పచ్చళ్లు చేసిమ్మని అడిగే వారి సంఖ్య పెరగడం మొదలయ్యింది. దీనినే చిన్న వ్యాపారంగా మార్చుకుంటే బాగుంటుంది కదా అనుకున్నాను. మా ఊరు గుంటూరుకు వెళ్లినప్పుడల్లా అక్కడ రైతుల దగ్గరకు వెళ్లి, కావల్సిన సరుకులను నేరుగా పొలాల నుంచే సేకరించేదాన్ని. ఒకటే నియమం పెట్టుకున్నాను. కేవలం వెజ్ పచ్చళ్లను మాత్రమే పెట్టాలి. అలాగే, రసాయనిక ఎరువు వాడకుండా పండించిన ఆర్గానిక్ పంటల నుంచే సేకరించాలనుకున్నాను. నేరుగా రైతులను కలిసి, వారి ద్వారా పంటలను కొనుగోలు చేయడం, వాటిని బాగుచేయించి, తీసుకురావడమూ పెరిగింది. మిర్చి, పసుపు, మసాలా దినుసులు వంటివి ఏయే ప్రాంతాల్లో ఏయే ఏవి అధికంగా పండుతాయో తెలుసుకుని, ఆ దినుసులను సేకరిస్తూ ఉంటాను.

ఒక్కరిగానే...

మొదట్లో ఒక్కదాన్నే పచ్చళ్లకు అవసరమైనవన్నీ ఏర్పాటు చేసుకునే దాన్ని. అందుకు తగిన పనుల ప్లానింగ్ కూడా చేసుకున్నాను. మెల్లగా మార్కెట్ పెరుగుతుండటంతో సాయానికి మరొకరిని నియమించుకుని, పనులు చేస్తూ వచ్చాను. కామాక్షి ఫుడ్స్ పేరుతో పదేళ్ల క్రితం ఈ వ్యాపారాన్ని రిజిస్టర్ చేయించుకొని, ఇప్పుడు నాతోపాటు మరో ముగ్గురు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాను. మొదట్లో అంతగా తెలియకపోయినా మార్కెట్ గురించి నాకు నేనుగానే ఓ అంచనా వేసుకుంటూ షాప్స్, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఆర్డర్ల ద్వారానూ పచ్చళ్లు సిద్ధం చేస్తుంటాను. టొమాటో, గోంగూర, మాగాయ, నిమ్మకాయ, చింతకాయ.. వంటి పచ్చళ్లు, పొడుల తయారీ రోజూ ఉంటుంది.

రోజూ ఉదయం నాలుగు గంటల నుంచే మొదలయ్యే నా దినచర్య తిరిగి, రాత్రి పదిగంటలకే పూర్తవుతుంది. నాకు ఇద్దరు పిల్లలు. మా వారు ఉద్యోగి. ఇల్లు, పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాను. ఏడాదికి ఇరవై లక్షల ఆదాయంతో ఈ మార్గం నాలో ఓ కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. నా చేత్తో నలుగురికి రుచికరమైన పచ్చళ్లను అందివ్వడమే కాదు, నాతో పాటు ఇంకొందరికి ఉపాధినివ్వడం సంతోషంగా ఉంది. ఆర్డర్లను బట్టి తయారీ విధానాన్ని ఎంచుకుంటాను కాబట్టి నష్టం అనే సమస్య ఎప్పుడూ రాలేదు. చేసే పనిలో ముందుగానే అంచనా ఉంటే అది ఉద్యోగమైనా, వ్యాపారమైనా ఇంటితోపాటు సమర్థవంతంగా నిర్వర్తించే సత్తా మహిళలకెలాగూ ఉంటుంది’ అని వివరిస్తుంది రాజేశ్వరి.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: మోహనాచారి

న్యూస్‌మేకర్స్

నానమ్మ హ్హా.. మనవరాలు హ్హా...


● గీతా గోదరా, ఆష్కా

మనవరాలు కరాటే చేస్తుంటే నానమ్మ తోడుగా నిలబడి చూడటం ఆనవాయితీ.
కాని నానమ్మ కూడా కరాటే డ్రస్సు తొడుక్కుని గోదాలో దిగితే?
గుర్‌గావ్‌కు చెందిన 60 ఏళ్ల గీతా గోదరా ఆమె 13 ఏళ్ల మనవరాలు ఆష్కా గోదరా దుబాయ్‌లో తాజాగా జరిగిన కరాటే ఛాంపియన్ షిప్‌లో మెడల్స్ సాధించారు.
ఈ కాలపు నానమ్మ–మనవరాలు ఇలాగే ఉండాలని అందరూ మెచ్చుకుంటున్నారు.

గుర్‌గావ్‌లోని సెక్టార్ 5లో రెండేళ్ల క్రితం మనవరాలికి తోడుగా కరాటే అకాడెమీకి బయలుదేరిన గీతా గోదరా ఇదంతా ఇంత వేగంగా జరుగుతుందని అనుకోలేదు. తాను కూడా కరాటే ఛాంపియన్ అవుతానని అసలు అనుకోలేదు.

‘నేను పుట్టింది హర్యానాలోని పల్లెటూళ్లో. నా చదువు ఐదవ క్లాసుతో ముగిసిపోయింది. చిన్నప్పటి నుంచి సాహస కార్యాలు చేయాలని ఉండేది. ఒక వయసులో సైన్యంలో చేరాలని అనుకున్నాను. ఏవీ జరగలేదు. సంసారంలో పడ్డాను. నా మనవరాలు ఆష్కాకు నేను అసంపూర్తిగా వదిలేసిన కలలు నెరవేర్చుకునే వీలు ఉంది. అందుకని తను ఏం కోరినా సపోర్ట్ చేయాలనుకున్నాను. కరాటే నేర్చుకుంటానంది. నేను తోడుగా వెళ్లడం మొదలెట్టాను’ అంది గీతా గోదరా.

ఆమె ఇటీవల దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ (బుడోకాన్ కప్)లో 83 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకుంది. 22 దేశాల నుంచి ఈ పోటీల్లో కరాటేలో పాల్గొంటే వారిలో మన దేశం నుంచి 30 మంది ఉన్నారు. ఇంత మందిలో గీతా గోదరా మెడల్ సాధించింది.


● గీతా గోదరా

‘రోజూ నా మనవరాలు చేస్తున్న సాధన చూస్తే నాక్కూడా కరాటే నేర్చుకోవాలనిపించింది. ట్రైనర్ సునీల్‌ను అడిగాను– నా వయసు వారు నేర్చుకోవచ్చా అని. ఏ వయసు వారైనా నేర్చుకోవచ్చు... ఆసక్తి ఉండటమే ప్రధానం అని చెప్పాడు. వెంటనే నేను కూడా నేర్చుకోవడం మొదలెట్టాను’ అంది గీతా గోదరా.

కాని ఈ పరిస్థితి మనవరాలు ఆష్కాకు ఇబ్బంది తెచ్చి పెట్టింది. ‘నాతో పాటుగా మా నాయనమ్మ కూడా కరాటే ప్రాక్టీసు చేస్తుంటే నా స్నేహితులు ఆట పట్టించారు. నేను కూడా మా నాయనమ్మ ఇది చేయకపోతే బాగుండు అనుకున్నాను. కాని అకాడెమీలో ఆమె అన్ని ఎక్సర్‌సైజులను చాలా బాగా చేస్తుంది. పంచ్ గట్టిగా విసురుతుంది. ఆమెలో బలం చూసి ఆశ్చర్యపోయాను. ఇప్పుడు మెడల్స్ తెస్తుండటంతో గర్వపడుతున్నాను’ అంది ఆష్కా.

‘కరాటే మనసును, శరీరాన్ని ఒక తూగులో ఉంచుతాయి. ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. ఆత్మస్థయిర్యాన్ని కూడా ఇస్తాయి. ఇలాంటి ఒక వ్యాపకం ఉండటం స్త్రీలకు అవసరం’ అంటోంది గీతా గోదరా.

స్త్రీలకు ఆత్మరక్షణ విద్యలు తప్పనిసరి అనిపిస్తున్న ఈ రోజుల్లో ఈ నానమ్మ, మనవరాలు ఇస్తున్న సందేశంతో స్ఫూర్తి పొందాల్సిందే.

బ్యూటిప్

జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే...



కప్పు పెసరపప్పును ఉడికించి మెత్తగా పేస్ట్ చేసి అందులో కోడిగుడ్డు సొన (పసుపు– తెలుపు మొత్తంగా), టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి రెండు గంటల తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. వారానికోసారి ఈ మూంగ్‌దాల్ హెయిర్ ప్యాక్ వేస్తే జుట్టు ఆరోగ్యంగా నిగనిగలాడుతూ, ఒత్తుగా పెరుగుతుంది.

గమనిక: ప్రతిరోజూ నానబెట్టి గ్రైండ్ చేయడం సాధ్యం కాకపోతే పెసలను మరపట్టించి పిండిని నిల్వ చేసుకుని రోజూ వాడుకోవచ్చు. తాజాగా నానబెట్టి గ్రైండ్ చేస్తే పెసరలోని పోషకాలు త్వరగా చర్మానికి అందుతాయి.

సాగుబడి
రోహిణీ కార్తె : మే 25 నుంచి

మిత్రపురుగుల సేద్యం

■ ఎకలాజికల్ ఇంజనీరింగ్ సాగు పద్ధతులను ప్రాచుర్యంలోకి తెస్తున్న ఎన్.ఐ.పి.హెచ్.ఎం.

5న ప్రకృతి రైతుల మహా సమ్మేళనం

జూన్ 5(సోమవారం)న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రకృతి రైతుల మహా సమ్మేళనం నిర్వహించనున్నారు. పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ గ్రౌండ్‌లో ఉ. 10 గంటలకు సమ్మేళనం ప్రారంభమవుతుంది. పొలాన్ని అమ్మే వ్యవసాయం మానేద్దాం పొలాన్ని కొనుగోలు చేసే వ్యవసాయాన్నే చేద్దాం అనే నినాదంతో ఈ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నేత కుమారస్వామి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 10 వేల మంది రైతులు, వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అందరూ ఆహ్వానితులే.

సాగు మారితే జీవవైవిధ్యం భద్రం!


కర్నూలు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో కనిపించిన పక్షి గూడు

రసాయనాల మయమైపోయిన వ్యవసాయ పద్ధతిని ప్రకృతికి అనుగుణంగా మార్చుకుంటే భూతాపాన్ని తగ్గించడానికి, వాతావరణ మార్పుల్ని పంటలు ధీటుగా తట్టుకొని మంచి దిగుబడులు ఇవ్వడానికి అవకాశం ఉందన్నది తెలిసిందే. అదే విధంగా.. ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తే పంటల్లో వైవిధ్యత పెరుగుతుంది. పక్షులు తదితర జీవరాశితోపాటు మట్టిలో సూక్ష్మ జీవరాశి వైవిధ్యత కూడా పెరుగుతుందని ఐరాసకి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య పరిరక్షణ దినోత్సవం(మే 22) సందర్భంగా మరికొన్ని విషయాలు..

- ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ క్షేత్రాల్లో భూమి పైన పంటలు, పక్షులు, తేనెటీగల్లాంటి మిత్రపురుగులతోపాటు భూమి లోపల వానపాములు, సూక్ష్మజీవరాశికి సంబంధించిన జీవవైవిధ్యం 30–50% పెరుగుతుందని అనేక అధ్యయనాల్లో వెల్లడైందని ‘ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్’ తాజా నివేదిక చెబుతోంది. ఈ క్షేత్రాల్లో పంటలు, పక్షులు, మిత్రపురుగులు, సూక్ష్మజీవుల సంఖ్య 50% ఎక్కువగా ఉంటుందని, వీటి జాతుల సంఖ్య 30% అధికంగా ఉంటుందని నివేదిక పేర్కొంది.
- రసాయనాలు వాడని గడ్డిభూముల్లో కన్నా ప్రకృతి/సేంద్రియ పద్ధతుల్లో సాగయ్యే వార్షిక పంటల్లో, పండ్ల తోటల్లో జీవవైవిధ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.
- ప్రకృతి/సేంద్రియ సాగులో తేనెటీగలు, సాలీళ్లు, తదితర అరుదైన మిత్రపురుగుల సంఖ్య రసాయనిక క్షేత్రాలతో పోల్చితే 55% ఎక్కువగా, వీటి జాతుల వైవిధ్యం 27% ఎక్కువగా ఉందని నివేదిక తెలిపింది.
- ప్రకృతి/సేంద్రియ క్షేత్రాలు ఉన్న ప్రాంతాల్లో నాటు తేనెటీగల సంఖ్య, జాతుల వైవిధ్యంతో పాటు వాటి పునరుత్పత్తి రేటు కూడా పెరిగిందని ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్ నివేదిక తెలిపింది.
- ఆంధ్రప్రదేశ్‌లో 50 ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు, 50 రసాయనిక వ్యవసాయ క్షేత్రాల్లో సంచరించే పక్షుల సంఖ్యపై ఏపీ ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపీసీఎన్ఎఫ్) గత ఏడాది ఓ అధ్యయనం చేసింది.
- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో రెండు తోకల పిట్ట, నేత పక్షి, గిజిగాడి గూడు పక్షి, పిగిలి పిట్టలు 2,3 రెట్లు ఎక్కువగా తరచూ తిరుగాడుతూ కనిపించాయని ఏపీసీఎన్ఎఫ్ నిపుణుడు ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన ఏపీసీఎన్ఎఫ్ పరిశోధనా విభాగం హెడ్ డా. జాకిర్ హుస్సేన్ తెలిపారు. రసాయనిక క్షేత్రాల కన్నా ప్రకృతి పొలాలను ఎక్కువ పక్షులు సందర్శిస్తున్నాయన్నారు. పక్షుల రాక వల్ల శత్రుపురుగుల తీవ్రత తగ్గుతున్నదన్నారు.
- కర్నూలు జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే చోట ప్రకృతి పొలాల్లో నేత పక్షి గూళ్లు కనిపించటం విశేషం.


తోటల్లో చెట్ల వరుసల మధ్య ఇలా పూల మొక్కలు వేస్తే మిత్రపురుగులు వస్తాయి


రోడ్ల పక్కన ఖాళీల్లో పూల మొక్కల పెంపకం.. ఇవే మిత్ర పురుగుల కారిడార్లు!


ఎకలాజికల్ ఇంజనీరింగ్: పంటల మధ్య గట్లపై పూల మొక్కల పెంపకం


ఈ బొరియలూ తేనెటీగల ఆవాసాలే

తేనెటీగలు.. ఇవి 3 కోట్ల సంవత్సరాల క్రితం నుంచే భూగోళంపై జీవిస్తున్నాయి. మొక్కల/వ్యవసాయ జీవవైవిధ్యానికి, పర్యావరణ వ్యవస్థల మనుగడకు పరాగ సంపర్కం కీలకం. అడవిలో 90% మొక్కలు, చెట్లకు, 75% పంటలకు తేనెటీగలు తదితర ప్రాణుల వల్ల జరిగే పరాగ సంపర్కమే ఆధారం. 115 ప్రధాన ఆహార పంటలు ప్రపంచ ప్రజల ఆకలితీర్చుతున్నాయి. వీటిలో 87 పంటలు పుష్పించి సక్రమంగా పంట దిగుబడులు ఇస్తున్నాయంటే అందుకు 35% కారణం తేనెటీగలు తదితర చిరు మిత్ర జీవులే. రసాయనిక వ్యవసాయ పద్ధతులు, చెట్లను నరికేయటం వల్ల వీటి మనుగడ ప్రమాదంలో పడింది. తేనెటీగలు వంటి మిత్ర పురుగులను రక్షించుకోవటం మన ఆహార భద్రతకు, పర్యావరణ ఆరోగ్యానికి ప్రాణావసరమని ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) చెబుతోంది. మనం వినిపించుకోవాలి.

ప్రతి నాలుగు పంటల్లో మూడు పంటలు తేనెటీగల సేవలు అందుకుంటున్నాయి. బాదం పంట దిగుబడులైతే నూటికి నూరు శాతం వీటిపైనే ఆధారపడి ఉంటుంది. తేనెటీగలకు 5 కళ్లు, రెండు రెక్కలుంటాయి. కొన్నయితే గంటకు 20 మైళ్లు ప్రయాణిస్తూ పరాగ సంపర్కానికి తోడ్పడుతుంటాయి.

పంటల మార్పిడి, వైవిధ్యత..

పర పరాగ సంపర్కానికి తోడ్పడే ఈ చిరుప్రాణులకు హాని కలిగించని బాధ్యతాయుతమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించమని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవం (మే 20) సందర్భంగా ఎఫ్.ఎ.ఓ. పిలుపునిచ్చింది. ‘పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, రసాయనిక పురుగుమందుల వాడకాన్ని తగ్గించటం, పరాగ సంపర్కానికి దోహదపడే తేనెటీగలు వంటి చిరు జీవులకు అవసరమైన ఆవాసాలను అంటే చెట్లను, పూల వనాలను పునరుద్ధరించటం, అభివృద్ధి చేయటం వంటి చర్యలు తీసుకోవాలని ఎఫ్.ఎ.ఓ. డైరెక్టర్ జనరల్ క్యు దోంగ్యు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు, రైతులు ఈ పిలుపును అందుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గిస్తే నీటిలో వీటి అవశేషాలు తగ్గుతాయి. తేనెటీగలకు మేలు జరుగుతుంది అన్నారాయన.

తేనెటీగల పరిరక్షణకు స్లొవేనియా విశేష కృషి చేస్తోంది. 2016 నుంచి మే 20వ తేదీని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుపుకోవడానికి స్లొవేనియా ప్రభుత్వ కృషే కారణం. ఖండాంతర దేశాల్లో 300కు పైగా తేనెటీగల పరిరక్షణ కార్యక్రమాల్లో స్లొవేనియా భాగస్వామైంది.

* * *

తేనెటీగలను మింగుతున్న రసాయన సేద్యం

- బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లో 20% తగ్గిన మిత్రపురుగులు

వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పెరుగుతున్న కొద్దీ సహజ తేనెటీగల సంఖ్య తగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాల్లో తేలింది. బెంగళూరు ప్రాంతంలో జరిగిన ఓ అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. నగరం చుట్టూతా విస్తరించిన 40 కిలోమీటర్ల ప్రాంతంలోని 60 గ్రామాల్లో అధ్యయనం చేస్తే సహజ తేనెటీగల సంఖ్య ఏకంగా 20% తగ్గినట్లు వెల్లడైంది. జర్మనీకి చెందిన గొట్టింజెన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం పరిశోధించింది. రసాయనిక వ్యవసాయం విస్తీర్ణం, సాంద్రత పెరుగుతున్నకొద్దీ తేనెటీగలు సమూహాలు తగ్గిపోతుండటాన్ని గుర్తించారు.

▸ నగరం నుంచి ప్రతి కిలోమీటరు దూరంగా వెళ్లే కొద్దీ ఆయా ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 2.4% మేరకు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ▸ 2016 డిసెంబర్– మే 2017 మధ్య 1275 కుటుంబాలపై అధ్యయనం చేశారు. ఇందులో 638 రైతు కుటుంబాలు. 3 కుటుంబాలకు చెందిన 31 జాతుల తేనెటీగలు ఆ ప్రాంతాల్లో గుర్తించారు. ▸ చెట్ల మీదనే కాకుండా నేలలో బొరియలు చేసుకొని ఆవాసాలను ఏర్పాటు చేసుకునే తేనెటీగలు ఉంటాయి. కాబట్టి, రసాయనిక పురుగుమందుల వల్లనే కాకుండా రసాయనిక ఎరువులు లేదా నీటి పారుదల వల్ల కూడా తేనెటీగల సంఖ్య తగ్గుతున్నట్లు గుర్తించారు. ▸ ఒక రైతు తన పొలంలో రసాయనిక ఎరువులు వాడటం లేదా నీటి తడి పెట్టడం చేస్తే అక్కడ తేనెటీగల సంఖ్య 20% తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు.

▸ పరిసరాల్లోని ఒక్కో పొలంలో పురుగుమందులు చల్లినప్పుడల్లా ఒక్కో శాతం తేనెటీగల సంఖ్య తగ్గిపోతూ వచ్చింది. అత్యధికంగా 80% మంది రైతులు, సగటున 25% మంది రైతులు రసాయనిక పురుగుమందులు చల్లుతున్నారు. ఆ మేరకు తేనెటీగల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ▸ అనేక సంవత్సరాల నుంచి ఉధృతంగా రసాయనిక వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో తేనెటీగలు 8.1% మేరకు తగ్గింది.

▸ రోడ్డుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 17.3% తగ్గిపోయింది. అదే విధంగా, దగ్గర్లో అడవి లేదా చెరువు ఉన్న చోట్ల 30–39% పెరిగింది. ▸ వ్యవసాయంలో విపరసాయనాలు, ముఖ్యంగా నియోనికోటినాయిడ్స్ వాడుతుండటం వల్ల తేనెటీగల నాడీవ్యవస్థ దెబ్బతింటున్నది. ఈ ప్రభావం వల్ల తేనె సేకరణకు వెళ్లిన తేనెటీగలు, ఇంకా ఇతర మిత్ర పురుగులు తిరిగి గూళ్లకు చేరకుండానే నేలరాలుతున్నట్లు పరిశోధకులు గుర్తించారంటున్నారు తేనెటీగల సంరక్షకురాలు జీవీ అపూర్వ.



ఎన్.ఐ.పి.హెచ్.ఎం. అధ్యయనం

హైదరాబాద్ రాజేంద్రనగరలోని జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్ఐపిహెచ్ఎం) శాస్త్రవేత్తలు తేనెటీగలు సహా అనేక మిత్ర పురుగుల వల్ల ఏయే పంటల సాగులో ఏ విధంగా ప్రయోజనం ఉంటుందనే అంశంపై అధ్యయనం చేశారు. మిత్రపురుగుల సంరక్షణతో కూడిన ‘ఎకలాజికల్ ఇంజనీరింగ్’ పద్ధతులపై జరిగిన అధ్యయనానికి అదనపు సంచాలకులు(పిహెచ్ఎం) డాక్టర్ ఈడ్పుగంటి శ్రీలత సారథ్యం వహించారు. పొద్దుతిరుగుడు, జనుము, మొక్కజొన్న, స్వీట్‌కార్న్, వంగ, బెండ, గుమ్మడి, సొర, బీర, చెర్రీ తదితర పంటలపై ఈ అధ్యయనం జరిగింది. గట్ల మీద పూల మొక్కలు సాగు చేశారు. 9 జాతులకు చెందిన 14 రకాల ఈగలు ఈ కూరగాయ తోటల్లో పరాగసంపర్కానికి దోహదపడినట్లు గుర్తించారు. అందులో 5 రకాల తేనెటీగలు ఉన్నాయి. వంగ తోటలో 14 రకాల ఈగలు కనిపించటం విశేషం.

ఎకలాజికల్ ఇంజనీరింగ్ అంటే?

‘ఎకలాజికల్ ఇంజనీరింగ్’ భావనను 1962లో తొలుత ప్రతిపాదించిన శాస్త్రవేత్త డా. హోవర్డ్ టి. ఒడుమ్. రసాయనిక సాంద్ర వ్యవసాయ పద్ధతుల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని గుర్తించి, పంట పొలాల్లో పర్యావరణ వ్యవస్థలను పునరుజ్జీవింపజేయటం. తద్వారా మొక్కలు, భూమి ఆరోగ్యాన్ని కాపాడటం. ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవటం ఈ భావన ముఖ్య లక్ష్యం. భూమిని బాగు చేయడానికి ఆచ్ఛాదన పంటలు, పంటల మార్పిడి, పచ్చిరొట్ట పంటలను సాగు చేసి కలియదున్నటం, సేంద్రియ ఎరువులతో పాటు జీవన ఎరువులు, జీవ రసాయనాలు వినియోగించటం ఎకలాజికల్ ఇంజనీరింగ్‌లో ముఖ్యమైన అంశాలు.

మిత్రపురుగులను ఆకర్షించడానికి ఆకర్షక పంటలు, శత్రుపురుగులను ఆకర్షించి మట్టుబెట్టడానికి ఎర పంటలు, శత్రుపురుగులను పారదోలడానికి వికర్షక పంటలు, పురుగులు తోటలోకి రాకుండా చూడడానికి కంచె/సరిహద్దు పంటలు వేసుకోవటం చీడపీడల నియంత్రణలో కీలకం. ‘పంటల తొలి 40 రోజుల్లో రసాయనిక పురుగుమందులు వాడకుండా ఉండటం ముఖ్యం. ఈ దశలోనే తేనెటీగలు సహా అనేక రకాల మిత్రపురుగులు వృద్ధి చెంది పంటకాలం అంతటా చీడపీడలను నియంత్రణలో ఉంచుతాయి..’ అంటున్నారు డా. శ్రీలత . 86 పంటల ‘ఎకలాజికల్ ఇంజినీరింగ్’ కోసం వెబ్‌సైట్ చూడొచ్చు.. https://niphm.gov.in/


బెండ పంటను రక్షించే మిత్ర పురుగులు